

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్

8 పేజీలు | బుధవారం | నవంబర్ 1, 2023 | www.navatelangana.com



అధిష్టానం హామీ ఇవ్వకుంటే పోటీలో నిలుస్తా

- టీపీసీసీ సభ్యులు గణేష్ రాథోడ్
- అనుచరులతో కలిసి విలేకరుల సమావేశం

4లో...



ఐక్యమత్యాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్
- కలెక్టరేట్‌లో జాతీయ సమగ్రత దినోత్సవం

8లో...

హ్యాట్రిక్‌పై 'అల్లోల' గురి..!



- జోరుగా ప్రచారం..చేరికలు...
- చాప కింద నీరులా అసమ్మతి

రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయంపై ఎలా ధీమాగా ఉందో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సైతం అలాగే ఆశలు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ అన్ని పార్టీల కంటే ముందుగానే టికెట్లు ఖరారు చేయడంతో మంత్రి అల్లోల బీఆర్ఎస్ అభ్యర్థిగా నియోజకవర్గంలో జోరుగా ప్రచారం చేస్తున్నారు. వివిధ పార్టీల నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతుండడంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్నారు. అయితే అసమ్మతి సైతం చేప కింద నీరులా పెరుగుతూ వస్తోందని చర్చలు సాగుతున్నాయి. కొంత మంది సీనియర్ నాయకులు బహిరంగంగానే బీఆర్ఎస్‌ను వదిలి కాంగ్రెస్, బీజేపీలో చేరుతున్నారు.

నవతెలంగాణ-నిర్మల్

హ్యాటిక్‌పై అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత అప్పటి టీఆర్ఎస్, ప్రస్తుత బీఆర్ఎస్ హవా తెలంగాణ వ్యాప్తంగా కొనసాగింది. 2014 ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన శ్రీహరిరావుకు అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం టికెట్ ఖరారు చేసింది. అలాగే 2009లో చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి చేరి గెలిచారు. అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు. అప్పటికే కాంగ్రెస్‌లో ఉన్న అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. దీంతో 2014 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి శ్రీహరిరావు, కాంగ్రెస్ నుంచి మహేశ్వర్‌రెడ్డి బరిలో ఉండగా, రాష్ట్రంలో అంతగా ఆదరణ లేని బహుజన సమాజ్ పార్టీ నుంచి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బరిలో దిగారు. తన సొంత ఇమేజ్‌తో పాటు తనకు నమ్మకమైన ముఖ్య నాయకుల అండతో 2014లో టీఆర్ఎస్ అభ్యర్థి శ్రీహరిరావుపై సుమారు 20వేల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. బీఎస్పీ నుంచి గెలిచిన అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి టీఆర్ఎస్‌లో చేరి మంత్రి పదవి చేపట్టారు. 2018లో మళ్లీ టీఆర్ఎస్ నుంచి మంత్రి అల్లోల ఎన్నికల బరిలో దిగారు. ఆయనకు పోటీగా కాంగ్రెస్ నుంచి మహేశ్వర్‌రెడ్డి బరిలో ఉన్నారు. అల్లోలతో మాజీ మున్సిపల్ చైర్మెన్ అప్పాల గణేష్‌చక్రవర్తి విబేధాల నేపథ్యంలో మహేశ్వర్‌రెడ్డి ఆయనను కాంగ్రెస్‌లో ఆహ్వానించారు. ఆయనతో పాటు పలువురు ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరారు. దివంగత మాజీ డిప్యూటీ స్పీకర్ భీంరెడ్డి కూతురు డాక్టర్ స్వర్ణరెడ్డి నియోజకవర్గంలో పాదయాత్ర చేసి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. దీంతో త్రిముఖ పోటీ ఏర్పడి పోరు హోరాహోరీగా సాగింది. చివరికి సుమారు 10వేల

మిగతా..2లో...

సరస్వతి దారెటు..?

- అధిష్టానం టికెట్ నిరాకరణతో కాంగ్రెస్‌కు రాజీనామా
- నియోజకవర్గంలో మారుతున్న సమీకరణాలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించినప్పటి నుండి ఆసిఫాబాద్ నియోజకవర్గంలో పరిణామాలు మారుతున్నాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో ప్రస్తుతం ఆ పార్టీకి ఉన్న అనుకూలతను ఆసరాగా చేసుకుని మళ్లీ నియోజకవర్గాన్ని చేజిక్కించుకోవడానికి మొదటి నుండి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పార్టీ నిర్ణయం తమకు అనుకూలంగా ఉంటుందని మూడు సంవత్సరాల నుండి ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. సంవత్సర కాలం నుండి రాథోడ్ గణేష్ కూడా తానే అభ్యర్థిగా ప్రచారం నిర్వహిస్తున్నాడు. తాజాగా ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ భర్త మాజీ డీటీఓ శ్యామ్‌నాయక్ పార్టీలో చేరడంతో పార్టీ వర్గాల్లో అభ్యర్థి ఎవరనే విషయం పెద్ద ఎత్తున చర్చ సాగింది. గతంలో బట్టి విక్రమార్క పాదయాత్ర సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు



విశ్వప్రసాద్, ప్రేమ్‌సాగర్‌రావు గ్రూపుల మధ్య పెద్ద గొడవ జరిగింది. విశ్వప్రసాద్, సరస్వతిని, ప్రేమ్‌సాగర్‌రావు రాథోడ్ గణేష్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. శ్యామ్‌నాయక్ రాకతో అందరి అంచనాలు తలకిందులయ్యాయి. తాజాగా కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించడంతో సరస్వతి టిపిసిసి ప్రధాన కార్యదర్శి పదవికి, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. రెండు రోజుల్లో ఎన్నికల్లో నిలబడడంపై నిర్ణయం తీసుకుంటానని చెప్పడంతో ఆమె దారేటు అనే చర్చ కొనసాగుతుంది.

సరస్వతి రాజీనామా దేనికి సంకేతం?

మాజీ కాంగ్రెస్ నేత మర్సుకోల సరస్వతి ఆదివాసీ తెగకు చెంది తనకంటూ వ్యక్తిగతంగా కొంత ఇమేజ్ కల్గి ఉంది. నియోజకవర్గంలో ఓటు బ్యాంకు కూడా కలిగి ఉన్నారు. నియోజకవర్గంలో 60వేలకు పైగా ఆదివాసీ ఓటర్లు ఉన్నారు. ఇదే తనకు కలిసి వస్తుందని మొదటి నుంచి భావిస్తున్న ఆమెకు పార్టీ చివరికి నిరాశ మిగిల్చింది. దీంతో పార్టీకి, పదవికి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించడంతో పాటు ఉద్వేగానికి గురై పోటీలో ఉంటానని ప్రకటించారు. ప్రస్తుతం ఆమె ఏ నిర్ణయం తీసుకుంటుందోనని చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి సరస్వతి రాజీనామా చేయగానే ఆమె బిజెపిలోకి వెళ్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే

మిగతా..2లో...

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి

- గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయకుమార్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రానున్న ఎన్నికల్లో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్ కుమార్ పోలీసులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఎస్పీలతో ఎస్ఐబీ ఐజీ ప్రభాకర్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు ఎస్పీలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మావోయిస్టు ప్రభావిత

మిగతా..2లో...

(మొదటి పేజీ తరువాయి)

హ్యాట్రిక్‌పై 'అల్లోల' గురి..!

ఓట్ల మెజార్టీతో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డిపై గెలిచారు.

చాపకింద నీరులా అసమ్మతి

2014లో సొంత ఇమేజ్‌తో గెలిచిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి 2018లో స్వల్ప ఆధిక్యతతో గట్టెక్కారు. ప్రస్తుత ఎన్నికల్లో గెలుపు సాధించాలని ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. 2014 ఎన్నికల్లో తనపై గెలిచిన అల్లోలకు అధిష్టానం మంత్రి పదవి కట్టబెట్టింది. శ్రీహరిరావు మంత్రి వెంటే ఉంటూ 2018లో సైతం మంత్రికి అండగా ఉండి గెలుపునకు కారణమయ్యారు. అయితే ఇంత చేసినా తమకు సముచిత స్థానం లభించలేదని శ్రీహరిరావు గ్రూపు అసంతృప్తిలో ఉండిపోయారు. కాంగ్రెస్‌లో ఉన్న మహేశ్వర్‌రెడ్డికి పార్టీ అధిష్టానం, రాష్ట్ర ముఖ్యనాయకుల మధ్య బేధాభిప్రాయాలు రావడంతో ఇటీవల కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఇదే అదనుగా మంత్రి వెంట ఉన్న శ్రీహరిరావు, సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. దీంతో పాటు గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి పోటీ చేసిన ప్రముఖ సీనియర్ న్యాయవాది మల్లారెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరారు. ఇలా ముఖ్యనాయకులంతా కాంగ్రెస్, బీజేపీలో చేరారు. మామడ, లక్ష్మణచాంద మండలాల్లో శ్రీహరిరావుకు మంచి పట్టు ఉంది. అలాగే సారంగాపూర్ జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డికి ఆ మండలంలో తనకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. దీంతో మంత్రికి ఓట్లు చీలిపోతాయనే భయం నెలకొంది. మరోవైపు చాలా కాలంగా కాంగ్రెస్‌లో ఉన్న మహేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం బీజేపీలో చేరినప్పటికీ నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు పట్టణంలో తనకంటూ ప్రత్యేక ఓటు బ్యాంకు ఉంది. ఇదిలా ఉంటే తెలంగాణ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం, అనవసరపు పథకాలను ప్రవేశపెట్టి సర్పంచులను ముప్పుతిప్పలు పెట్టడంతో వారంతా గుర్రుగా ఉన్నారు. పట్టణంలో పలు వార్డుల్లో అభివృద్ధి జరగకపోవడంతో పాటు బల్దియా పాలకవర్గంపై అవినీతి ఆరోపణలు తీవ్రస్థాయిలో వచ్చాయి. దీంతో కౌన్సిలర్లు సైతం అసంతృప్తిగా ఉన్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి పలు గ్రామాల్లోని సర్పంచులు, కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు, మాజీలు ఇతర పార్టీలకు వలస పోతున్నారు. ఉన్నవారు సైతం అంతర్గతంగా అసంతృప్తితో రగిలిపోతున్నారు.

జోరుగా ప్రచారం..చేరికలు..

బీఆర్ఎస్ తమ అభ్యర్థులను ముందస్తుగా ప్రకటించింది. దీంతో నిర్మల్ నియోజకవర్గ అభ్యర్థిగా అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డికి టికెట్ ఖరారు కావడంతో ఏ మాత్రం ఆలస్యం చేయకుండా ప్రచారం ప్రారంభించారు. ప్రస్తుతం ప్రచారం ఊపందుకుంది. ఇతర పార్టీల్లోని అసంతృప్త ముఖ్య నాయకులను, నాయకులను బీఆర్ఎస్‌లో చేర్పించుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. మరోసారి అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గెలుపు కోసం సర్వ శక్తులు ఒడ్డుతున్నారు. అల్లోల గెలిస్తే హ్యాట్రిక్ సాధించిన వ్యక్తిగా నిలుస్తారు.

సరస్వతి దారెటు..?

ఆమె మాత్రం ఇండిపెండెంట్‌గా పోటీలో ఉంటారని భావిస్తున్నారు. ఇదే విషయం ఆమెను అడగక ఇప్పటివరకు నిర్ణయం తీసుకోలేదని, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటానని తెలపడంతో పాటు రాథోడ్ గణేష్‌తో కలిసి ఆదివాసీ నాయకులను కూడగట్టుకొని ఇటీవల పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది.

నియోజకవర్గంలో మారుతున్న సమీకరణాలు

కాంగ్రెస్‌లో ఎప్పటి నుండే ఉంటూ ప్రజల్లో ప్రచారం చేస్తున్న వారికి టికెట్ నిరాకరించడంతో వారు అధిష్టానంపై గుర్రుగా ఉన్నారు. నిరసన తెలుపుతూ అసమ్మతి జెండా ఎగరేస్తున్నారు. సరస్వతి కాంగ్రెస్‌కు రాజీనామా చేయడంతో బిజెపిలోకి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది. ఇదే జరిగితే నియోజకవర్గంలో సమీకరణాలు మారే అవకాశం ఉంది. ఇప్పటికే బీజేపీలో కోట్నాక విజయ్, ఆత్మరాం నాయక్ ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారుగా ప్రచారం నిర్వహిస్తుండగా, సరస్వతి పార్టీలోకి వస్తే మరింత ఇబ్బందికర పరిణామాలు తలెత్తే అవకాశం ఉంది. ఆసిఫాబాద్ నియోజకవర్గ టికెట్ ఇంకా ఎవరికీ కేటాయించకపోవడంతో రానున్న రోజుల్లో సమీకరణాలు మారే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌లో గ్రూపు పోరు కొనసాగుతుండగా సరస్వతి పార్టీ మారితే అది అధికార పార్టీకి లాభం చేసే అవకాశం ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా రానున్న నెల రోజుల్లో రాజకీయాలు మరింత రంజుగా మారే అవకాశం ఉంది.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ..

ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం అందించుకోవాలన్నారు. దీనివల్ల మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరం అవుతుందని, ఎన్నికలను సజావుగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించవచ్చని తెలిపారు. నామినేషన్‌ల స్వీకరణ నుండి ఫలితాల విడుదల వరకు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా చూసుకోవాలన్నారు. జిల్లాకు అదనంగా కేటాయించిన కేంద్ర పారామిలటరీ బలగాలను ఉపయోగించి పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యాత్మకంగా ఉన్న పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను నియమించి భద్రత చర్యలు తీసుకోవాలని, మావోయిస్టు ప్రభావిత కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టి ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలను ముందుగానే గుర్తించి సమాచారాన్ని అందించాలని, అలాగే అంతర్రాష్ట్ర చెక్ పోస్టుల వద్ద నిఘా పెంచాలని పేర్కొన్నారు. నగదు, మద్యం సరఫరా వంటి అనైతిక కార్యకలాపాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ కే.సురేష్‌కుమార్, ఎస్ఐబీ పి.వేణుగోపాలరావు, ఆదిలాబాద్, నిర్మల్ ఎస్పీలు డి ఉదయ్ కుమార్‌రెడ్డి, సిహెచ్ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయ రాఘవన్, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నేరరహిత సమాజం కోసమే కార్డన్ సెర్చ్ : సీఐ



నవతెలంగాణ -ముధోల్

నేరరహిత సమాజం కోసమే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సిఐ వినోద్‌రెడ్డి అన్నారు. మండలంలోని విట్టోలి గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున సిఐ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని తెలిపారు. గ్రామాలలో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారాన్ని అందించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో అందరూ కలిసి మెలిసి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. సరైన వాహన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 76, ఫోర్ వీలర్స్ 6 స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్సైలు సాయికిరణ్, సాయికుమార్, పోలీస్ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

వానమామలై వరదచార్యులకు ఘన నివాళి



నవతెలంగాణ-చెన్నూర్

ప్రముఖ కవి అభినవ పోతన బిరుదాంకితులు వానమామలై వరదచార్యులు 39వ వర్ధంతి సందర్భంగా ఆయన సంస్మరణ కార్యక్రమం పట్టణంలోని జగన్నాథ ఆలయ ఆవరణలో జరిగింది. ముందుగా ఆలయం ముందున్న వరదాచార్యుల విగ్రహానికి స్థానిక కవులు, కళాకారులు పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు బొడ్డు మహేందర్ మాట్లాడుతూ కొమ్మెర విశ్వేశ్వరశర్మ వ్యవస్థాపకులుగా, మంచాల రాజబాబు కన్వీనర్‌గా ఈరోజు 'వరదన్న సాహిత్య పీఠం' పురుడు పోసుకోవడం శుభ సూచకమన్నారు. తర్వాత కవులు వరదాచార్యులతో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. కవితలు చదివారు. హాజరైన వారికి జిల్లా సాంస్కృతిక సమాఖ్య తరపున అధ్యక్షులు వై.సత్యనారాయణ ఆత్మీయ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మంజీర సంఘం ప్రధాన కార్యదర్శి మేకల రామస్వామి, కవులు బండారి సమ్మయ్య, మామిడి అక్షిత, లక్ష్మీనారాయణ, దబ్బెట రాజమల్లు, దుర్గం రాజేశంగౌడ్, కళాకారులు వేల్పుల పోచం, తబలా చారి, మహంకాళి అశోక్, శ్యాంసుందర్ దేవుడా, మామిడి బాపు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల ఆకస్మిక దాడులు

● 10 లీటర్ల నాటుసారా స్వాధీనం ● మూడు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



నవతెలంగాణ - దహెగాం

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఈజ్‌గాంలోని కిరాణ దుకాణాల్లో తనిఖీ నిర్వహించగా అరికిల్ల మల్లయ్య కిరాణ దుకాణంలో ఐదు మద్యం బాటిళ్లతో పాటు 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. మల్లయ్యపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. అలాగే కల్వాడ గ్రామ శివారులోని నాటుసారా తయారు చేస్తున్న స్థావరంపై దాడి చేసి మూడు వేల లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసినట్టు తెలిపారు. ఎవరైన బెల్టుషాపు నిర్వహించిన, నాటుసారా అమ్మిన, కొనుగోలు చేసిన, తయారుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ ఆర్ కిషన్, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ప్రధాని ఇందిరమ్మ వర్ధంతి వేడుకలు

దస్తురాబాద్ : దేశ తొలి మహిళ ప్రధాని ఇందిరా గాంధీ 39వ వర్ధంతి వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షులు దుర్గం మల్లేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పొద్దుటూరి సతీష్‌రెడ్డి హాజరై ఇందిరాగాంధీ ఫోటోకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ బడుగు బలహీన వర్గ ప్రజల అభ్యున్నతికి తోడ్పడ్డారని తెలిపారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన ప్రజా నాయకురాలు దేశం కోసం తన ప్రాణాలను అర్పించారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే అన్ని వర్గాల ప్రజలకు సూపరిపాల అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చుంచు భూమన్న, పుల్యా నాయక్ నాగన్న, దశరథ్, నాగరాజు, రాజన్న, ఆనంద్, రాజేష్, శంకర్, లింగన్న, దయాకర్, ప్రసాద్ వెంకటేష్, మల్లికార్జున్, కృష్ణ, గంగాధర్, రాజేందర్, గోపి పాల్గొన్నారు.

పత్తి పంట ధ్వంసం

దహెగాం: మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన బుద్దె గురువయ్య పత్తి పంటను మంగళవారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఎనిమిది ఎకరాల్లో పత్తి పంట వేయగా రెండు ఎకరాలు ధ్వంసం చేశారు. గురువయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సనత్‌కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామాలు

దస్తురాబాద్ : మండలంలోని మున్యాల గ్రామంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షులు సిర్ప సంతోష్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌కు 200 మంది కార్యకర్తలు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు మంగళవారం జగదాంబ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ఏర్పడిన నుండి పని చేస్తున్న కార్యకర్తలను గుర్తించడంలో పార్టీ విఫలమైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామాలు ఇలాగే కొనసాగుతాయని తెలిపారు.

బీఆర్ఎస్ పోలింగ్ బూత్ స్థాయి కమిటీ ఎన్నిక

కడెం : బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పి కో ఆప్షన్ మెంబర్ ఎండి రఫిక్ అహ్మద్, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షులు జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ భూక్యా అమ్మి బాపురావు ఆధ్వర్యంలో మంగళవారం లక్ష్మీసాగర్ గ్రామంలో పోలింగ్ బూత్ కమిటీని ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి భూక్యా రాజేష్, ఉపసర్పంచ్ మూడికే మల్లేష్ యాదవ్, వార్డ్ సభ్యులు కాంతి గంగాసాగర్, గోధురి ఆనంద్, గోదురి రాజేందర్, మాలవత్ మోహన్ నాయక్, భూక్యా ప్రకాష్ పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేసుకోవాలి

వాంకిడి : మండలంలోని రైతులు పీఎం కిసాన్ పథకానికి ఇప్పటివరకు ఈకేవైసీ చేసుకోలేని రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ తెలిపారు. చాలామంది రైతులు ఈఐకేవైసీ నమోదు చేసుకోవడం లేదని, ఇప్పటికైనా దీనికి సంబంధించిన వివరాల కోసం వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించినట్టయితే రైతులకు అన్ని వివరాలు తెలియజేస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిర్మల్
బుధవారం నవంబర్ 01, 2023

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మూకుమ్మడిగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. మండలానికి చెందిన ముస్కు నర్సారెడ్డి, కండెల సుభాష్‌రెడ్డి, కీని ముత్యంరెడ్డి, అంకాపురం ముత్యంరెడ్డి, కొల్లోళ్ల రాజిరెడ్డి, సుబ్బన్నోల్ల రాజారెడ్డి, కోడె మనేష్, కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు మాట్లాడుతూ అవినీతి ప్రభుత్వాన్ని అంతమొందించాలంటే కాంగ్రెస్ పార్టీ వల్లే అవుతుందని గ్రహించాలని సూచించారు.



బీఆర్ఎస్ గెలువు ఖాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్ గెలుపు ఖాయమని అల్లోల దివ్యారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ), బాబాపూర్ గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకే ఓటేసి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అభివృద్ధిని చూసి ఓటువేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ ఎర్ర రఘునంధన్‌రెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేంధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ కొరిపెల్లి కృష్ణారెడ్డి, జిల్లా ప్రచార కార్యధర్శి అడ్వాల రమేశ్, నాయకులు మేకల రాజేంధర్ యాదవ్, అర్జున్‌రెడ్డి, గణేష్, సల్లా రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-నిర్మల్

భారతదేశ మొదటి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, జిల్లా అధికారులతో కలిసి ఏక్తా దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

దస్తురాబాద్ : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉక్కుమనిషిగా పేరొందిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళు లర్పించారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



నవతెలంగాణ-లక్ష్మణచాంద

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని మండల వ్యవసాయ అధికారి మంగ్లారపు ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి క్వింటాలుకు 'ఎ' గ్రేడ్‌కు రూ.2వేల 203, 'బి' గ్రేడ్‌కు రూ.2వేల 183 మద్దతు ధరను చెల్లిస్తుందని అన్నారు. దళారుల దగ్గర తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఉమామహేశ్వరి, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు కొమ్ముల మహిపాల్ రెడ్డి, రైతులు ఏలేటి మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నర్సాపూర్(జి) మండల కేంద్రంలో మంగళవారం పోలీసు సిబ్బంది, బీఎస్ఎఫ్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు శాంతియుతంగా జరగాలని ప్రజలు ధైర్యంగా ఓట్లు వేయాలని ఎస్సై రవీందర్ తెలిపారు. ఎన్నికల్లో అత్యుత్సాహం చూపించి, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల్లో పోలింగ్ అధికారుల పాత్ర కీలకం

● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అశిష్ సంగ్వాన్



ఎన్నికల అధికారులు పీఓ, ఏపీఓ, సిబ్బందికి పలు సూచనలు చేస్తున్న జిల్లా రిటర్నింగ్ అధికారి అశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల నిర్వహణలో పోలింగ్ అధికారుల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో మాస్టర్ ట్రైనర్‌లు అసెంబ్లీ ఎన్నికల విధులు కేటాయించిన పీఓ, ఏపీఓ, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హజరై మాట్లాడారు. బాధ్యతాయుతంగా, నిబద్ధతతో పీఓ, ఏపీఓలు సమన్వయంతో ఎన్నికల నిబంధనల ననుసరించి విధులు నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులూ లేకుండా సజావుగా ఎన్నికలు జరిగేందుకు పోలింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలని, అందుకు కావాల్సిన అన్ని విషయాలపై అవగాహన కల్పించడం కోసం ఇప్పటికే మాస్టర్ ట్రైనర్స్‌చే శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోలింగ్ ఒకరోజు ముందు, పోలింగ్ రోజు, పోలింగ్ అధికారులు తీసుకోవాల్సిన చర్యలు, విధులు ఏమిటి అనేది స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. ఎన్నికలను నిబంధన ప్రకారం నిర్వహించాలన్నారు. పోలింగ్ రోజు పోలింగ్ ప్రారంభానికి (90) నిమిషాల ముందు అన్ని పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించాలన్నారు. ఓటరు జాబితాలో పోస్టల్ బ్యాలెట్, చనిపోయిన వారి వివరాలు, తదితర వివరాలను మార్క్ చేయబడి ఉంటుందని, ఓటు వేయడానికి వచ్చే ఓటరు వద్ద నుంచి మొదటి ప్రాధాన్యత ఎపిక్ కార్డుతో (12) రకాల ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డులను వినియోగించుకోవచ్చన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల నిర్మల్, ఖానాపూర్, ముదోల్‌లో పీఓ, ఏపీఓలకు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని సుమారుగా మూడు వేల మంది ఈ శిక్షణకు హాజరయ్యారని అన్నారు. పోలింగ్ ఒక రోజు ముందు పోలింగ్ సామాగ్రి తీసుకున్న తర్వాత పోలింగ్ కేంద్రంలో కావాల్సిన ఏర్పాట్లను అన్ని పూర్తి చేసుకొని సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో నిర్మల్ రిటర్నింగ్ అధికారి రత్న కళ్యాణి, డీఈఓ రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీదేవి, శిక్షణ కోసం వచ్చిన పీఓలు, ఏపీఓలు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలి

● కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. మంగళవారం నిర్మల్ మండలంలోని ముజ్గి గ్రామంలోని మల్లన్న స్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు చేసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారుల వల్ల తెలంగాణ వస్తే అధికారం అనుభవిస్తున్నది మాత్రం కేసీఆర్ కుటుంబమని అన్నారు. గ్రామంలో గడపగడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభయ హస్తం హామీలు, ఆరు గ్యారంటీలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని కోరారు. తొమ్మిదేండ్ల కాలంలో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అన్నారు.



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక..

నిర్మల్ జిల్లా కేంద్రంతో పాటు దిలావర్‌పూర్, లక్ష్మణచాంద, మామడ, సోన్ మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి



ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-కడెం

దేశానికి ఇందిరా గాంధీ చేసిన సేవలు మరువలేనివని, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల మల్లేష్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దుర్గాభవాని అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ఇందిరాగాంధీ విగ్రహానికి మంగళవారం పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నాపూర్ సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ముస్కు రాజు, వాజీద్ ఖాన్, బబ్లు, సలీం, భూషణ్, ధర్మయ్య, పోశన్న, గొల్ల శ్రీనివాస్, రహీం, రాజన్న, రాజేష్, నర్సరెడ్డి, శంకర్, ఇస్రు, చాంద్‌బాషా, రమేష్, పొన్నాల వెంకటేష్, కన్నె శ్రీనివాస్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ వినతికి స్పందించిన జీఎం

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో చెత్త డంపింగ్‌యార్డులో మంటలు అంటుకొని విషవాయువులతో కూడిన పొగ వస్తుందని, దాని నివారణకు చర్యలు తీసుకోవాలని టీబీజీకేయస్ ఆధ్వర్యంలో విన్నవించారు. దీనిపై బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి రవిప్రసాద్ దీనిపై స్పందించారు. చెత్త యార్డులో వెలువడుతున్న పొగను బయటకు రాకుండా సిబ్బందితో నీళ్ల పట్టించారు. స్పందించిన సింగరేణి యాజమాన్యానికి, జనరల్ మేనేజర్‌కు టీబీజీకేయస్ బెల్లంపల్లి ఏరియా తరపున ధన్యవాదాలు తెలిపారు. జీఎం శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.

ఉచిత కంటి శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కాగజ్‌నగర్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ శిబిరంలో 53 మందిని పరీక్షించగా, ఇందులో 41 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ ప్రతీ మంగళవారం నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-సిరికొండ

బీఆర్ఎస్‌తోనే ప్రజల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఒరగంటి పెంటన్న అన్నారు. మంగళవారం మండలంలోని రాయిగూడ, సుంకిడి, పాండుగూడ, కోసు పటేల్ గూడ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పార్టీ మేనిఫెస్టోను, ప్రభుత్వం చేసినటువంటి అభివృద్ధి పథకాలను ఓటర్లకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్, చందు, రోహిదాస్, కృష్ణ, చంద్రకళ, గొర్ల రాజన్న, గణేష్, నర్సయ్య, లతీఫ్ పాల్గొన్నారు.

బోథ్‌లో ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మంగళవారం 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బి.గోవర్ధన్ ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించి, ఈ సందర్భంగా మాట్లాడారు. కార్మికుల కోసం ఏర్పాటు అయినా ఏఐటీయూసీ నిరంతరం దేశ వ్యాప్తంగా లక్షల కార్మికుల హక్కుల కోసం పోరాడుతునే ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో బీడీ కార్మిక ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి గోదావరి, నాయకులు నరేష్, షాకీర్, సుమేర్ పాషా, ప్రేమ్ పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

నవతెలంగాణ-తాంసి

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన మండలంలోని హస్నాపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హస్నాపూర్ గ్రామానికి చెందిన గంపెల్లి గంగమ్మకు చెందిన ఇంట్లో మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చుట్టూ పక్కల వారు గమనించి, విద్యుత్ సరఫరా నిలిపి వేసినప్పటికీ మంటలు అదుపులోకి రాలేదు. ఇండ్లు పూర్తిగా దగ్ధం కాగా తన కూతురు శ్రీమంతం కోసం తీసుకువచ్చిన కిరాణా సామానుతో పాటు నూతన బట్టలు ఇంట్లోని వస్తువులను పూర్తిగా దగ్ధమయ్యాయి. దాదాపు రూ.2లక్షల వరకు అస్తి నష్టం జరిగిందని కన్నీటి పర్యంతమయ్యారు.

బాలికను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

- టీఏవీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్



సీఐ రామకృష్ణకు వినతిపత్రం అందిస్తున్న టీఏవీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఉట్నూర్

ఆదివాసీ బాలికను అత్యాచారయత్నం చేసి హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూసం సచిన్ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని భీంజీగూడాలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఘటనపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ విద్యార్థిని హత్య జరిగి 4 రోజులు గడుస్తున్న పోలీసులు ఇప్పటి వరకు నిందితులను పట్టుకోవడం లేదని, హత్య కేసుపై ఎంతటి నిర్లక్ష్యం చేస్తున్నారోనని ఆయన ఆరోపించారు. వెంటనే నిందితులని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో సీఐ రామకృష్ణని కలిసి వినతిపత్రం అందించి దర్యాప్తు వేగవంతం చేయాలని కోరారు. వారి వెంట సంఘం జిల్లా అధ్యక్షులు ఉయిక విష్ణు, మండల అధ్యక్షులు కనక మల్కు, కార్యదర్శి మడవి నాగోరావ్ ఉన్నారు.

అధిష్టానం హామీ ఇవ్వకుంటే పోటీలో నిలుస్తా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పార్టీని కష్టకాలంలో ఆదుకున్న తనకు అధిష్టానం మూడు రోజుల్లో స్పష్టమైన హామీ ఇవ్వకుంటే రానున్న ఎన్నికల్లో పోటీలో నిలుస్తానని పీసీసీ సభ్యుడు గణేష్ రాథోడ్ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఎమ్మెల్యే టికెట్లను అమ్ముకుందన్నారు. నియోజకవర్గాల వారిగా కష్టపడిన వారిని పక్కకు పెట్టి పారాషుట్ నాయకులకు టికెట్లు ఇవ్వడం దారుణామన్నారు. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కష్టకాలంలో తాను పార్టీని నిలబెట్టానని గుర్తు చేశారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమానికి కూడా నిధులు వెచ్చించి వాటిని విజయవంతం చేశానన్నారు. అధిష్టానం టికెట్లు అమ్ముకునే బదులు గాంధీభవన్ కిరాయికి ఇస్తే డబ్బులు వస్తాయని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో శ్యాం నాయక్ గెలవడం అసాధ్యమన్నారు. పార్టీ గెలిచే నియోజకవర్గ టికెట్ ఓడిపోయే అభ్యర్థికి ఇచ్చారన్నారు. శ్యాం నాయక్ గెలిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని అన్నారు. రానున్న మూడు రోజుల్లో అధిష్టానం తనకు స్పష్టమైన హామీ ఇవ్వాలని, లేనట్లయితే కార్యకర్తలతో మాట్లాడి పోటీలో ఉండి శ్యామ్ నాయక్ ఓటమి లక్ష్యంగా పని చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమయ్య, ఎండీ.నిజాం, గడ్డల సత్తన్న, తిరుపతి, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించాలి



రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని తొమ్మిదో వార్డులో డ్రైనేజీ లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ (ఎం) పట్టణ కార్యదర్శి ముంజం ఆనంద్‌కుమార్, నాయకులు చాపిలె సాయికృష్ణ తెలిపారు. మంగళవారం వారు రోడ్డు మీద నిల్వ ఉన్న మురికి నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైనేజీ లేకపోవడంతో మురికి నీరు మొత్తం రోడ్డుపైకి ప్రవహిస్తూ, దుర్వాసన వస్తోందని అన్నారు. సమీపంలోనే పాఠశాల ఉన్నా, అధికారులు పట్టించుకోకపోవడం సరికాదని అన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో కాలనీవాసులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చంద్రబాబు విడుదల పట్ల కార్యకర్తల హర్షం



కాగజ్‌నగర్‌లో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్ట్ అయి బెయిల్‌పై విడుదలైన ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు మంగళవారం విడుదల కావడంతో జిల్లాకు చెందిన ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదిలాబాద్ టీడీపీ కార్యాలయంలో పార్టీ శ్రేణులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచి పెడుతూ సంబరాలు చేసుకున్నారు. ఇది తెలుగు తమ్ముళ్లు, తెలుగు ప్రజలందరూ కలిసి చేసుకునే సందర్భమని అన్నారు. కుట్రపూరితంగా అక్కడి వైఎస్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 54 రోజుల పాటు ఆయనను జైల్లో నిర్బంధించిందని అన్నారు. అధైర్య పడకుండా ఉండాలని అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. తెలుగు రాష్ట్రల్లోనే కాక ప్రపంచలోని తెలుగు ప్రజలందరూ చంద్రబాబుకు మద్దతుగా నిలిచారని వారందరికీ పార్టీ పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ కార్యదర్శి ఆకుల రాము, పార్లమెంట్ కార్యదర్శి గంగసరపు ఓమన్న, పార్లమెంటు బీఎన్‌టీయూసీ అధ్యక్షులు భాను, రాజేశ్వరరావు, మావల మండల పార్టీ అధ్యక్షులు తోకల లక్ష్మన్న, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పతిహర ప్రభాకర్, ఎస్సీ సెల్ నాయకులు కుమ్మరి నరేందర్, మండల నాయకులు ఆరె రాజన్న, పి.వంశీ, గణేష్, శివకుమార్, శశాంక్, దశరథ్, షేక్ ఫారుక్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు బెయిల్ మంజూరు కావడంతో స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం కాగజ్‌నగర్‌లో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జి ఆనంద్ మాట్లాడుతూ చంద్రబాబుపై అక్కడి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి జైలుకు పంపిందని అన్నారు. ఇలాంటి చర్యలకు రాబోయే రోజులలో ప్రజలే బుద్ధి చెపుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ వేడుకలను మంగళవారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక సివిల్ సప్లై గోదాంలో ఏఐటీయూసీ జెండాను సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1921, అక్టోబర్ 31న ముంబయిలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, నాటి నుండి నేటి వరకు ఎన్నో పోరాటాలు, త్యాగాలతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. కార్మిక హక్కుల పరిరక్షణ ఏఐటీయూసీతోనే సాధ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు కిషన్, సుధాకర్, అంజి, సురేష్, రాజు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

● ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆదిలాబాద్ పార్లమెంటరీ ఇన్‌చార్జి, కర్ణాటక ఎమ్మెల్సీ ప్రకాష్ రాథోడ్ అన్నారు. మంగళవారం మావల తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువకుడు, ఉత్సాహవంతుడైన కంది శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీకి తిరిగి బహుమతి ఇవ్వాలని అన్నారు. అందరూ ఏకతాటిపైకి వచ్చి గ్యారంటీ హామీలపై క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో వచ్చేది ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ప్రజలు శాంతి, సౌభాగ్యాలతో జీవనం సాగించాలంటే అది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. డిసెంబర్ 30న బీజేపీ, బీఆర్ఎస్ డిపాజిట్లు గల్లంతు కాబోతున్నాయన్నారు. తెలంగాణలో సర్కార్ ఏర్పడగానే మొట్టమొదటి ప్రాధాన్యత ఈ 6 గ్యారంటీల అమలేనని స్పష్టం చేశారు. తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియా గాంధీని బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. టికెట్టు కోసం ఇక్కడి నుంచి పోటీదారులు చాలామంది ఉన్నా, కంది శ్రీనివాస్‌రెడ్డే సరైన అభ్యర్థిగా అధిష్టానం భావించిందన్నారు. ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీల పన్నాగాలను కాంగ్రెస్ కార్యకర్తలు సమర్థవంతంగా ఎదుర్కోవాలన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ స్థాయిలో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను ఇంటింటికీ తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. అంతకుముందు కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికలకు సమయం ఆసన్నమైందని, తోడుదొంగల పాలనకు అంతం పలుకుదామని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న, పాయల శంకర్ ఇద్దరూ ఒక్కటేనని, బీఆర్ఎస్, బీజేపీకి ఓటువేస్తే అవి చెత్తబుట్టలో పడ్డట్టేనని అన్నారు. ఆటు నియోజకవర్గం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సభా ప్రాంగణం కోలాహలంగా మారింది. బెంగుళూర్‌కు చెందిన అనూష బూత్ స్థాయి ఇన్‌చార్జిలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాందేడ్ మాజీ కార్పొరేటర్, ఏఐసీసీ సభ్యులు అబ్బాస్, కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మెన్ ముడుపు దామోదర్‌రెడ్డి, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, మున్సిపల్ మాజీ చైర్మెన్ దిగంబర్‌రావు పాటిల్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు మునిగెల నర్సింగ్, ఎస్టీ సెల్ చైర్మెన్ షెడ్మకి ఆనంద్‌రావు, బేల మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాందాస్ నాక్లే, సీనియర్ నాయకులు భరత్ వాగ్మారే, వక్ఫ్‌బోర్డు మాజీ జిల్లా అధ్యక్షుడు సైద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు భరత్ వాగ్మారే, ఐనేని సంతోష్‌రావు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్, కంది శ్రీనివాస్‌రెడ్డి

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన పలువురు గ్రామస్తులు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈటెల శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, సమ్మెట రవి, దినేష్, వినేష్, బైండ్ల భాస్కర్, బైండ్ల జాన్, బైండ్ల నాగన్న, ఎంజలి రాజేందర్, భాస్కర్ పాల్గొన్నారు.

డిసెంబర్ 9న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక కోర్టులో డిసెంబర్ 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జడ్జి హుసేన్ అన్నారు. మంగళవారం కోర్టులో ఏర్పాటు చేసిన సమావేశంలో జడ్జి హుస్సేన్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను న్యాయవాదులు, కక్షిదారులతో మాట్లాడి విజయవంతం చేయాలని అన్నారు. అలాగే ప్రతి సారి జిల్లాలో లోక్ అదాలత్ కార్యక్రమంలో మన బోథ్ కోర్టు పరిధిలోనే ఎక్కువ కేసులు పరిష్కారం చేయడం జరుగుతుందని అన్నారు. ఈసారి కుడా ఎక్కువ మొత్తంలో కేసులు పరిష్కారం అయ్యేట్టు న్యాయవాదులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వామన్‌రావ్ దేశ్‌పాండే, పంద్రం శంకర్, ఏజీపీ విక్రమ్, న్యాయవాదులు కే సుభాష్, అంగద్ కేంద్రే, రూపేందర్ సింగ్, ఆడెపు హరీష్, దమ్మాపాల్, కుమ్మరి విజయ్ కుమార్, జమీర్ పాల్గొన్నారు.

గడప గడపకు బీఆర్ఎస్ ప్రచారం

నవతెలంగాణ-బోథ్

బోథ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మేనిఫెస్టోను ఇంటింటికి వెళ్లి వివరించారు. మంగళవారం ఈ సందర్భంగా ఎంపీపీ తుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపదలో ఆదుకునే పార్టీ రైతు కష్టాల్లో ఉన్నారని తెలుసుకొని రైతుబంధు, రైతు బీమా, ప్రవేశపెట్టారని అన్నారు. ఆడపిల్ల పుడితే భారం కాకుండా కళ్యాణలక్ష్మితో భరోసానిచ్చారు. ఆసరా పెన్షన్‌తో అవ్వ తాతలకు, వితంతు వికలాంగులకు ఆసరాగా కేసీఆర్ నిలిచారని అన్నారు. గిరిజనులకు పోడు భూములు పంపిణీ చేసి పోడు పట్టాలు అందించారని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి, బోథ్ గడ్డపై గులాబీ జెండాను ఎగుర వేయాలని అన్నారు. కార్యక్రమంలో సొహకార సంఘం అధ్యక్షుడు కదం ప్రశాంత్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్, ఎంపీటీసీలు మహిపాల్, రాజేశ్వర్, రోహిదాస్, జుగాదిరావు, నాయకులు విజయ్, అల్లకొండ ప్రశాంత్, బొడ్డు శ్రీనివాస్, డైరెక్టర్ శ్రీనివాస్, హరీష్, కృష్ణ, ప్రదీప్, వినయ్, మణికంఠ, కార్యకర్తలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి అండ

నవతెలంగాణ-సారంగాపూర్

కార్యకర్తలే బీఆర్ఎస్ పార్టీకి అండని పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షులు నల్ల వెంకట్ రామ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యకర్తల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవాలని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కలిసి కట్టుగా పనిచేసి మరోసారి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ మాణిక్ రెడ్డి, ఎఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి మాజీ చైర్మెన్‌లు రాజ్ మహమ్మద్, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ మాధవ్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

బోథ్‌లో కాంగ్రెస్ బైక్ ర్యాలీ

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వన్నెల అశోక్ ఆధ్వర్యంలో మంగళవారం నేరడిగొండ మండలం టోల్ ప్లాజా నుంచి భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్, కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే అభ్యర్థి వన్నెల అశోక్ మాట్లాడుతూ కాంగ్రెస్ గెలుపు దిశగా ప్రయాణిస్తుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో రాగానే రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ కేంద్రంలో కావాల్సిన ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఇక్కడనే ఏర్పాటు చేస్తామని అన్నారు. పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలుపరుస్తుందని ఇందిరమ్మ రాజ్యం తప్పకుండా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో బోథ్, నేరడిగొండ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను ఆదరించాలి : మున్సిపల్ చైర్మెన్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

బీఆర్ఎస్ పార్టీని ప్రజలు ఆదరించాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వివిధ వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. రణదీవే నగర్‌లో గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల తీరును కాలనీవాసులకు వివరించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ముందుకు సాగుతోందని అన్నారు. ప్రతిపక్షాలు మాత్రం అధికార దాహంతో అసత్యపు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందన్న నమ్మకం ప్రజల్లో లేదని తెలిపారు. బీజేపీ ఇప్పటివరకు మేనిఫెస్టోను సైతం ప్రకటించలేని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ఇంటింటికి అందుతున్నాయని స్పష్టం చేశారు. అభివృద్ధే లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కు మరోసారి ఓటు వేసి ఎమ్మెల్యే జోగు రామన్నను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోవ రవి, కొండ గణేష్, పర్వీన్ ఫెరోజ్, మహేందర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా..

● ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మారుమూల ఆదివాసీ గ్రామాలైన గోపాల్‌పూర్, లక్కీపూర్, కన్నాపూర్, హీరాపూర్, అందుగూడ, పాటగూడ, బండ పాటగూడ, అంజి, కేస్లాగూడ తదితర గ్రామాల్లో ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రజలు మరోసారి బీఆర్ఎస్‌ని ఆశీర్వదించాలని కోరారు. రైతుల కోసం రైతుబంధు, కళ్యాణ లక్ష్మీ, పింఛన్లు, 24 గంటల ఉచితంగా కరెంటు ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్ అయితే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మొద్దన్నారు. ఆయన వెంట నాయకులు కనక తుకారాం, ఎంపీపీ పి.శోభా, సర్పంచులు జాదవ్ లఖన్, ఆడే విజయ, హన్మంతు, జిలానీ, మడవి భీమ్‌రావ్, గిత్తె ఆశ, టహరే గణేష్ ఉన్నారు.



6

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

బుధవారం నవంబర్, 01 2023

బీఆర్ఎస్‌లో చేరిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి చెందిన టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల్కర్ సాయిరాం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవలక్ష్మి సమక్షంలో ఆమె క్యాంపు కార్యాలయంలో వందమందితో కలిసి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ అందిస్తున్న సంక్షేమ ఫలాలు తెలంగాణ రాష్ట్రానికి దిక్సూచిగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో మూడవసారి హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా కేసీఆర్ కావడం ఖాయమన్నారు.



బహుజన రాజ్యం బీఎస్పీతోనే సాధ్యం



నవతెలంగాణ-దహెగాం

బహుజన రాజ్యం బీఎస్పీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు హర్షద్‌హుస్సేన్ అన్నారు. మంగళవారం మండలంలోని పీఏసీఎస్ డైరెక్టర్ షాకీర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు బీఎస్పీలో చేరారు. రాష్ట్ర నాయకులు హర్షద్‌హుస్సేన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ విధానాలు నచ్చకనే బహుజన రాజ్య సాధన కోసం చేరినట్లు దహెగాం ఉప సర్పంచ్ ప్రశాంత్, వార్డుమెంబర్ నాగుల లక్ష్మి, నల్లి అశోక్, సీనియర్ నాయకులు ఎలుకరి సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర నాయకులు హర్షద్‌హుస్సేన్ మాట్లాడుతూ బహుజన రాజ్యం సాధించాలంటే బీఎస్పీని గెలిపించాలని, బహుజనులంతా ఏకం కావాలని కోరారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మికకర్షక వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాటం చేయడమే తమ లక్ష్యమని, ఏఐటీయూసీతోనే కార్మిక హక్కుల సాధ్యమని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. మంగళవారం ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో జిల్లా అధ్యక్షుడు దివాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలి కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్‌తో కలిసి జండా ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, రానున్న ఎన్నికల్లో వారిని ఓడించాలన్నారు. 1920 అక్టోబర్31న దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో తమ సంఘం ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుండి కార్మిక కర్షక వ్యతిరేక విధానాలపై నిరంతర పోరాటం చేస్తూ అనేక విజయాలు సాధించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇటు రాష్ట్రంలో అటు దేశంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరస్తున్నాయని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వాటికి తగిన గుణపాఠం చెప్పకుంటే కార్మికుల భవిష్యత్తు గందరగోళంలో పడుతుందన్నారు. కార్మిక చట్టాల సవరణ పూర్తిగా హక్కులను కాలరాయడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో మాత్రమే హామీలు ఇస్తున్నాయని తర్వాత వాటిని తుంగలో తొక్కుతున్నాయని తెలిపారు. కార్మికులు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు పిడుగు శంకర్, నాయకులు, లక్ష్మణ్, శ్రీనివాస్, షఫీ, కొమురక్క, సురేష్, మోహన్, తిరుపతి, బావుజి, తూకారం, దివాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్

వారంలోపు దీపావళి బోనస్ చెల్లింపు

- టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి ఉద్యోగులకు దీపావళి బోనస్ డబ్బులను వారంలోపు ఇప్పించనున్నట్టు టీబీజీకేయస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు తెలిపారు. మంగళవారం ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో పర్యటించిన ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరించనున్నట్టు ఆయన భరోసా ఇచ్చుఆరు. త్వరలో కార్మికులకు రావాల్సిన ప్రమోషన్‌లు ఇప్పించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేయస్ జీఎం కమిటీ సభ్యులు చంద్రశేఖర్, మారిన వెంకటేశ్వర్లు, ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశ్, అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి భాస్కరాచారి, నాయకులు కాయిత స్వామి, ఓరం కిరణ్, రామ్మోహన్, శ్యాంసుందర్, మేకర్తి మల్లేష్, రాజమౌళి, రాజేశం, మోరె సత్యనారాయణ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల అమలు బీఆర్ఎస్‌తోనే సాధ్యం



కెరమెరిలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమృద్ధిగా సంక్షేమ పథకాలు అమలు చేయడం బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అడ్డఘాట్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఏ ప్రభుత్వం కూడా ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మికి మద్దతు తెలిపి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విమల కిష్టయ్య, దినకర్ నాయకులు పాల్గొన్నారు.

కెరమెరి : మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కుమురం భీం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మీ తరపున ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ పేందూర్ మోతిరాం, జడ్పీటీసీ సెడ్మాకి దృపతాబాయి, వైస్ ఎంపీపీ సయ్యద్ అబుల్ కలాం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందేలా పాలన కొనసాగించిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. సామాన్య ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఇఫ్తేకార్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ గోగర్ల రాజయ్య, నాయకులు రాంచందర్, జాయేద్ ఖాన్, మున్ను పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-దహెగాం

తెలంగాణ గ్రామీణ బ్యాంకు రాస్పల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో మండలంలోని ఇట్యాల గ్రామంలో మంగళవారం కళాజాత బృందంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంకు పథకాలపై బ్యాంకు స్కీం, క్రాప్ లోన్, పొదుపు, గృహ రుణాలు, ఎడ్యుకేషన్, గోల్డ్ లోన్, రుణమాఫీపై, ముఖ్యమంత్రి సామాజిక భద్రత పథకాలు సురక్షా బీమాయోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, నగదు రహిత లావాదేవీలపై, సైబర్ మోసాలపై జాగ్రత్త వహించాలని ప్రజలకు అర్థమయ్యే రూపకంగా మాటలు, పాటలు, మ్యాజిక్ షో ద్వారా కళాజాత బృందం అవగాహన కల్పించింది. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సాయిచరణ్, ఫీల్డ్ ఆఫీసర్ జగదీష్, సాయి, షకీల్, కళాజాత బృందం సభ్యులు ఎం తేజకుమార్, వేణు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకానికి ఈ-కేవైసీ చేసుకోవాలి

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని రైతులు పీఎం కిసాన్ పథకానికి ఇప్పటి వరకు ఈ-కేవైసీ చేసుకోలేని రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి మిలింద్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో చాలామంది రైతులు ఈ-కేవైసీ నమోదు చేసుకోవడంలేదని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోలేటిలో ప్రచారం చేసిన టీబీజీకేఎస్

నవతెలంగాణ-రెబ్బెన

బీఆర్ఎస్ అభ్యర్థి కోవలక్ష్మిని గెలిపించాలని టీబీజీకేయస్ ఉపాధ్యక్షుడు మల్రాజ్ శ్రీనివాస్‌రావు ప్రచారం నిర్వహించారు. మంగళవారం గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి కార్మిక కాలనీలో బీఆర్ఎస్‌కు ఓటు వేసి కోవలక్ష్మిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలను అందించారు. కేసీఆర్ కారుణ్య నియామకాలు ఇచ్చారని, లాభాల వాటా పెంచి అందజేశారని గుర్తు చేశారు. క్వార్టర్లకు ఏసీలు పెట్టుకొనే విధంగా అనుమతిచ్చారని తెలిపారు. బీఆర్ఎస్‌కు ఓటు వేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీబీజీకేయస్ జీఎం కమిటీ సభ్యుడు మారిన వెంకటేశ్వర్లు, నాయకులు కాయిత స్వామి, ఓరం కిరణ్, బాబురావు, రమేష్, మోరె సత్యనారాయణ, రమేష్ పాల్గొన్నారు.

డబ్బులు తిరిగి చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రాట్యూటి, ఇతర బెన్ఫిట్స్ కోసం తన వద్ద నుంచి కమీషన్‌గా తీసుకున్న డబ్బులను తిరిగి చెల్లించాలని తిర్యాణి మండలం గిన్నెదరి గ్రామానికి చెందిన సంధ్య డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన తండ్రి విజయరావ్ 2022 ఆగస్టు 25వ తేదీన మరణించారని తెలిపారు. ప్రభుత్వ నుండి రావాల్సిన గ్రాట్యూటీ, ఇతర బెనిఫిట్స్ ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉండగా గంటలో అకౌంటులో పడే విధంగా చేస్తానని ఎమ్మెల్యే పీఏగా పనిచేసిన సంపత్ నమ్మించాడని తెలిపారు. దీనికిగాను తనకు రూ. 2లక్షల 5 వేలు కమిషన్ అడగగా రూ.1లక్ష80 వేలు ఫోన్ పే చేశామని తెలిపారు. ఈ సంఘటన జరిగి రెండు నెలలు గడిచినప్పటికీ తమ డబ్బులు రాలేదన్నారు. డబ్బులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో పోలీసులను ఆశ్రయిస్తానని హెచ్చరించారు.

దరఖాస్తు గడువు పెంపు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2024-25 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయలో తొమ్మిది మరియు 11వ తరగతిలో ప్రవేశానికి గాను దరఖాస్తు గడువును నవంబర్ ఏడో తేదీ వరకు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపల్ డాక్టర్ బి చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా గడువు తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హిందువులకు క్షమాపణ చెప్పాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

హిందూ మతంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వెంటనే హిందూ సమాజానికి బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని హిందు వాహిని జిల్లా ఉపాధ్యక్షులు సైదం నాగరాజు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిర్పూర్ నియోజకవర్గంలోని కౌటాల మండలంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాషాయ కండువా ఆదివాసులను నాశనం చేసే కండువాని, మత కల్లోలాలు సృష్టించే కండువా అని వ్యాఖ్యలు చేశారన్నారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడిన ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రణయ్, సాయి, కరణ్, సంజయ్, శ్రీకాంత్, సాయి పాల్గొన్నారు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-భీమిని

మండలంలోని వడాల గ్రామంలో బ్యాంకు కళాజాత బృందం ఆర్థిక అక్షరాస్యత పథకాల వినియోగం ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు వాటి వినియోగం తదితర అంశాలతో పాటు సురక్ష బీమా, జీవనజ్యోతి భీమా, అటల్ పెన్షన్ యోజన ఏ విధంగా పొందాలి, వాటి వివరాలను ప్రజలు, బ్యాంకు ఖాతాదారులకు తెలియజేశారు. మూఢనమ్మకాలపై మ్యాజిక్ షో ద్వారా అవగాహన పెంపొందించారు. ఈ సందర్భంగా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ వేణుగోపాలరావు బ్యాంకును పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలు తెలుసుకోవాడానికి బ్యాంకులో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది అశోక్, రవి, కళాజాత బృందం సభ్యులు తేజ్ కుమార్, వేణు పాల్గొన్నారు



ఆదరించండి అభివృద్ధి చేసి చూపిస్తా

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు

నవతెలంగాణ-జన్నారం

ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఖానాపూర్‌ను అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండలంలోని మందపల్లి, రేండ్లగూడ, లింగయ్యపల్లె, బాదంపెల్లి, జన్నారం, పోన్కల్, చింతలపల్లె గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ పథకాలను గెలిచిన వెంటనే అమలు చేస్తామన్నారు. రూ.500కే సిలిండర్, రూ. 2 లక్షలలోపు రుణమాఫీ చేస్తామన్నారు. ప్రజలు పార్టీని ఆదరించి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని తెలంగాణ రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంటింటికి నాయకులు, కార్యకర్తలు మేనిఫెస్టోను వివరించాలని సూచించారు.ఆరు గ్యారెంటి కార్డులే పార్టీని గెలిపిస్తాయన్నారు. ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముసాఫర్ అలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి మేకల మాణిక్యం, జిల్లా నాయకులు మోహన్ రెడ్డి సుభాష్ రెడ్డి, రాజశేఖర్, దాముగా కరుణాకర్, ఫసియుల్లా , మత్స్య శంకరయ్య, గంగన్న, రాజన్న పాల్గొన్నారు.



ఘనంగా ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవం



జెండా ఎగరవేస్తున్న సింగరేణి కాలరీస్ వర్కర్ యూనియన్ కార్యదర్శి

నవతెలంగాణ-ఆదిలాబాద్

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 104వ ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శిలు కే వీరభద్రయ్య. ముస్కె సమయ్య హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1920లో భారత దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘంగా ఆవిర్భావించిందని, స్వాతంత్రం కోసం పోరాటం చేసిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, ఇప్పుడు కార్మికులు అనుభవిస్తున్న అనేక హక్కులు, చట్టాలను అమలుపరచడంలో కిలక పాత్ర పోశించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలు నిర్వహించి, హక్కులు సాధించిన ఘనత ఏఐటీయూసీకు ఉందన్నారు. సింగరేణి కార్మికుల హక్కులు, లాభాల వాట, దీపావళి బోనస్ తదితర హక్కులను సాధించామని తెలిపారు. రాబోయే కాలంలో కూడా సింగరేణి కార్మికవర్గం ఏఐటీయూసీని మరింత ఆదరించి నూతన హక్కుల సాధనలో, సంస్థ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం యూనియన్ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, ఫిట్ కార్యదర్శులు గుడిగంట నరసింహారావు, ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్, నాయకులు యాదగిరి, శ్రీకాంత్, శ్రావణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి

నవతెలంగాణ- కాసిపేట

మండల కేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత దేశ తొలి మహిళా ప్రధాని ఉక్కు మహిళా ఇందిరా గాంధీ అని కొనియాడారు. రైతు కూలీలను సీలింగ్ చట్టంతో రైతులుగా తయారు చేసిన ఇందిరా గాంధీదన్నారు. సామాన్యులకు బ్యాంకు సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సిద్ధం తిరుపతి, రాజమౌళి, రమేష్, గోలేటి స్వామి, జాడి శివ, మారం కుమార్, రౌతు పవన్, దేవుసింగ్, సిలివెరీ కుమాం, కటిక వరం, బొగ్గుల నర్షయ్య, ముస్తఫా, జంపన్న, గుండా రాజుకుమార్ పాల్గొన్నారు.



సోమగూడెంలో...

కాంగ్రెస్ ఆధ్వర్యంలో మొదటి భారత మహిళా ప్రధాని ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని సోమగుడెంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందరా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళ్ళర్పించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, సర్పంచ్ వేముల కృష్ణ, ఎంపీటీసీలు పార్వతి మల్లేష్, భీంరావు, నాయకులు మెరుగు శంకర్, మాజీ సర్పంచులు జాడి శంకర్, ప్రభాత్ రావు, కామేర శ్రీనివాస్, కనుకుల రాకేష్, షాకీర్, విద్యాసాగర్, కొత్త రమేష్, పంబాల తిరుపతి, సీనియర్ ఆదివాసీ నాయకులు కొడప అనంతరావు, గాదం గట్టయ్య పాల్గొన్నారు.

సీఓఈలో జాతీయ సమైక్యత దినోత్సవం

నవతెలంగాణ-తాండూర్

జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా బెల్లంపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీలో మంగళవారం ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. ముందుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రాజ్ కుమార్, జేవీపీ కొక్కుల రాజేశ్వర్, సిబ్బంది శ్యామ్ సుందర్, ప్రమోద్ కుమార్, ఆర్.రామారావు, శ్రీరామ వర్మ, మిట్ట రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలని ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జైపూర్

బీఆర్ఎస్ అభ్యర్థి గెలవాలని ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం అధ్యక్షులు గుండు తిరుపతి దంపతులు టేకుమట్ల గ్రామంలోని రామాలయంలో మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ చెన్నూర్‌లో బాల్క సుమన్ గెలుపును ఎవ్వరు ఆపలేరని, గతం కంటే రెట్టింపు మెజార్టీతో గెలువబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గం అభివృద్ధి బాల్క సుమన్‌తోనే సాధ్యమని, ప్రజలు బాల్క సుమన్ గెలుపును ఆకాంక్షిస్తున్నారని అభిప్రాయపడ్డారు. అదేవిదంగా తెలంగాణ రాష్ట్రం అభివృద్ధికి పాటుపడుతున్న బీఆర్ఎస్ మరోమారు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, సీఎం కేసీఆర్ ముఖ్యమంత్రిగా మూడవ సారి అధికారాన్ని చేపట్టబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.



ఇండ్ల పట్టాల బాధితులకు అండగా ఉంటాం

నవతెలంగాణ-ఆదిలాబాద్

నస్పూర్‌లో కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఇండ్ల పట్టాల బాదితులకు అండగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఉంటామన్నారు. మంగళవారం కాంగ్రెస్ నాయకుడు ప్రేంసాగర్‌రావు చేతిలో మోస పోయిన ఇండ్ల పట్టాల బాధితులు సీసీసీ కార్నర్‌లో ధర్నా చేపట్టారు. వారికి పార్టీ తరపున మద్దతు తెలిపారు. 2013 ఏప్రిల్‌లో కాంగ్రెస్ హయాంలో ప్రేమ్‌సాగర్ రావు ఎమ్మెల్సీ చెల్లని పట్టాలు ఇచ్చి నెల రోజుల లోపల భూమి ఇస్తా అని హామీ ఇచ్చారన్నారు. ఇప్పటి వరకు భూమి ఇవ్వకుండా పేద ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. 10 సంవత్సరాల నుండి ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్ కూడా ఇండ్ల పట్టాల బాధితులకు న్యాయం చేయకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆగల్‌డ్యూటీ రాజు, నాయకులు పానుగంటి రంగారావు, సత్రం రమేష్, ఈర్ల సదానందం, సామ్రాజ్ రమేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

నవతెలంగాణ-కాసిపేట

తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని భావించి యువత భారీగా చేరుతున్నారని ఎన్నికల కమిటీ స్ట్రాటజీ చైర్మెన్, మాజీ ఏమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. మంగళవారం ఆయన సమక్షంలో పార్టీ అధ్యక్షులు వేముల కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మల్కేపల్లి బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు శ్రీరాముల రమేష్, సభ్యులు రొడ్డ సృజన్, కుడిమేత వసంత్ కాంగ్రెస్‌లో చేరారు. వారికి ప్రేమ్‌సాగర్ కండువా కప్పి ఆహ్వానించి రాబోయే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్కేపల్లి, ధర్మారావ్‌పేట ఎంపీటీసీలు భీంరావ్, పార్వతి మల్లేష్, మాజీ సర్పంచ్ ప్రభాతరావు, సీనియర్ నాయకులు, అన్నం కుమార్, చారి, మహంకాళి, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు విద్యాసాగర్, సాయికిరణ్ పాల్గొన్నారు.



c m y k

ప్రత్యేక బలగాలతో పోలీసుల కవాతు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-దండేపల్లి

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛయుత వాతావరణంలో వినియోగించుకునే విధంగా భరోసా కల్పించడం కోసమే పోలీసు కవాతు నిర్వహిస్తున్నామని లక్షెట్టిపేట సీఐ క్రిష్ణ అన్నారు. మంగళవారం పారమిలటరీ కేంద్ర బలగాలు, పోలీసు సిబ్బంది మండల కేంద్రంతో పాటు వెల్గనూర్, మామిడిపల్లి గ్రామాలలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ క్రిష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించటానికి సమస్యాత్మక, అతిసమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నమన్నారు. అందులో భాగంగానే పారమిలటరీకి చెందిన 100మంది సిబ్బందితో పాటు పోలీసు సిబ్బంది కలిసి పోలీసు కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తూ ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని పెర్కొన్నారు. పోలింగ్ స్టేషన్ వారిగా ఎప్పటికప్పుడు తనిఖీలు, నేరచరిత్ర కలిగిన వారిని బైండోవర్ చేస్తున్నట్లు తెలిపారు. నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కవాతులో దండేపల్లి, లక్షెట్టిపేట, జన్నారం ఎస్సైలు ప్రసాద్, లక్ష్మణ్, సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్

● జైపూర్ ఏసీపీ మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ మోహన్

నవతెలంగాణ-జైపూర్

గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉండి, నేర ప్రవృత్తి కలిగిన వారు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎన్నికలు సమీపిస్తున్నందున శాంతి భద్రతలకు భంగం కలిగించిన వారిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేస్తామని జైపూర్ ఏసీపీ మోహన్ హెచ్చరించారు. మంగళవారం తన కార్యాలయంలో 40 మంది రౌడీ షీటర్లతో సమావేశం నిర్వహించారు. రౌడీ షీటర్లు, అనుమానితులకు కౌన్సిలింగ్ నిర్వహించి బైండోవర్ చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల స్వేచ్ఛ హక్కులకు భంగం కలిగిస్తే సహించేది లేదని, చిన్న చిన్న గొడవలకు దిగినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ప్రతి 6 నెలలకు ఒకసారి చెడు ప్రవర్తన కలిగిన, బైండోవర్ చేసిన వారిపై పోలీస్ నిఘా ఉంటుందన్నారు. ప్రతి కదలికలు, ప్రవర్తన గుర్తించి తెలుసుకోవడం జరుగుతుందనిన్నారు. బైండోవర్ కాలంలో ఏదైనా నేరానికి పాల్పడితే జరిమానంతో పాటు జైలు శిక్ష విధిస్తామన్నారు. ఈ సంధర్భంగా రౌడీ షీటర్లకు సంబంధించి వారి జీవన విధానం, ప్రస్తుతం వారి కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్న ఆయన శాంతియుతంగా ఎన్నికల నిర్వాహణకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సీఐలు రమేష్ బాబు, ఉపేందర్, నాగరాజు, శ్రీరాంపూర్, ఎస్సైలు రాజేష్, ఎస్సై రాజవర్ధన్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం మండలంలోని చిట్యాల్‌బోరి, చింతగూడ, తంతోలి, గ్రామాల్లో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి దళారీల వ్యవహరిస్తున్నాడని మళ్లీ రైతులకు మూడు గంటలే కరెంట్, రైతుబంధు ఆపేయాలంటూ మాట్లాడటం మానుకోవాలని హెచ్చరించారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్, స్థానిక ఎమ్మెల్యేగా జోగు రామన్న గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేసుకోగలుగుతామన్నారు. భారతదేశంలో ఎక్కడ లేని సంక్షేమ పథకాలు కేవలం తెలంగాణలో మాత్రమే అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గంద్రత్ రమేష్, వైస్ ఎంపీపీ జంగు పటేల్, బీఆర్ఎస్ నాయకులు సెవ్వ జగదీష్ యాదవ్, మల్లేష్, సర్పంచులు మడవి లక్ష్మీబాయి, భీంరావు, కుమ్ర లక్ష్మి బాయి వసంతరావు, బీఆర్ఎస్ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు



మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

నవతెలంగాణ-దండేపల్లి

ఎన్నికల్లో పార్టీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. దొండపల్లి, మేదరిపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఆగడాలను భరించలేకనే పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేసేందుకు గాను పార్టీ కార్యాలయం ప్రారంభించడం జరిగిందన్నారు. అధికారంలోకి వస్తేనే బడుగు బలహీన వర్గాల ప్రజల బ్రతుకులు బాగుపడతాయని, ప్రతి ఒక్క కార్యకర్త బూత్ స్థాయిలో కష్టపడి పార్టీని మళ్ళీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమావ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్, కొంగల నవీన్, సర్పంచులు భూక్య చంద్రకళ, బిళ్ళకురి శంకరయ్య మండల అధ్యక్షుడు నేల్కి వెంకటేశ్వర్లు, నాయకులు చీటి సత్యం రావు, వెంగళరావు, బులిశెట్టి లక్ష్మీనారాయణ, బొమ్మెన మల్లేష్, గొట్ల అశోక్, గాజుల లక్ష్మి నారాయణ, కటుకురి రాజన్న, శ్రీధర్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐక్యమత్యాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారత దేశ ఐక్యమత్యం, సమగ్రతను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశ ఐక్యమత్యం, సమగ్రత, భద్రతలను కాపాడడానికి పునరంకితం చేయడానికి కృషి చేయాలని అన్నారు. అంతకుముందు అధికారులు, సిబ్బందితో కలెక్టర్ జాతీయ సమైక్యత ప్రతిజ్ఞను చేయించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్తా, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ పాల్గొని భారతదేశంలోని వివిధ మతాలు, వివిధ కులాలు భిన్న వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ఉంటారని ప్రపంచంలోని ఇతర దేశాలకు ఈరోజు భారతదేశ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దయాకర్, అష్రాఫ్అలీ పాల్గొన్నారు.

పోలీసు ముఖ్య కార్యాలయంలో

సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అనిర్వచనీయమైనదని వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ పోలీసు ముఖ్య కార్యాలయంలో సర్దార్ వల్ల భాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు అలంకరించి పూలమాలలతో సత్కరించి, జాతీయ ఐక్యత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లో, కార్యాలయాల్లో ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞను చేశారు. కార్యక్రమంలో వర్టికల్ డీఎస్పీ పోతారం శ్రీనివాస్, పోలీస్ కార్యాలయం ఏఓ భక్త ప్రహ్లాద్, సూపరింటెండెంట్లు సంజీవ్, గంగాధర్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు నవీన్ కుమార్, టి మురళి, కార్తీక్, సైబర్ సెల్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, అదనపు ఎస్పీ సీసీ గిన్నెల సత్యానారాయణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ

ఆదిలాబాద్‌లోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, భరద్వాజ్, సిబ్బంది, విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆయన చేసిన సేవలను, కృషిని కొనియాడారు. కార్యక్రమంలో విభాగాధిపతులు రాజ్ కుమార్, క్రాంతి కుమార్, సుజయ్, రాజన్న, అనిల్ కుమార్ చౌహన్, అధ్యాపకులు శ్రీనివాస్, విజయలక్ష్మి, యశశ్రీ, జ్యోత్స్నరాణి, హేమలత, ప్రవీణ్, సురేష్, సంగీత, రామేశ్వర్‌రెడ్డి, రవికుమార్, నీల్‌కమల్, గజానంద్‌రావు, మురళీకృష్ణ, కుమారస్వామి, సంజయ్ సింగ్ ఉన్నారు.

ఉట్నూర్ : భారత దేశ ఐక్యమత్యం, సమగ్రతను పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్ కుమార్ అన్నారు. మంగళవారం జాతీయ సమైక్యత దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాథోడ్ భీంరావ్, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కాగజ్‌నగర్ : భారత ప్రథమ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనరసింహం మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం వివిధ రాజుల పాలనలో ఉన్న సంస్థానాలను ఏకం చేసి అఖండ భారతావనిని నిర్మించిన ఘనత వల్లభాయ్ పటేల్‌కే దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి తూడూరు దత్తాత్రేయ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో..

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ సమైక్యతా దినం పురస్కరించుకొని వల్లభాయ్ పటేల్ జయంతిని నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు యు నారాయణ, ఎల్లాగౌడ్, వాహేబ్, గంగాధర్, తూడూరి ప్రకాష్, మార్త ఉపేందర్ పాల్గొన్నారు.